నమస్తే తెలంగాణ


# రంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 23 నవంబర్ 2024 RANGAREDDY



గత ప్రభుత్వం కొహెడలో ఏర్పాటు చేయతలపెట్టిన పండ్లమార్కెట్‌కు సంబంధించిన మ్యాప్

## నాడు అభివృద్ధి బాటలు.. నేడు హడావుడి మాటలు




- కొహెడ పండ్ల మార్కెట్‌కు స్థల సేకరణ పూర్తి చేసిన బీఆర్ఎస్
- అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- 11 నెలలుగా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆలస్యంగా మేల్కొని.. పూర్తి చేస్తామంటూ హడావుడి ప్రకటనలు

రంగారెడ్డి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కొహెడలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించాలని తలపెట్టిన పండ్లమార్కెట్‌కు మంచిరోజులు వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో దక్షిణ భారతదేశంలోనే పెద్దదిగా కొహెడ పండ్ల మార్కెట్‌ను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా స్థలసేకరణ, నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలను చేపట్టింది. ప్రభుత్వం మారడంతో పండ్ల మార్కెట్ నిర్మాణ విషయంలో జాప్యం జరిగింది. నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు పండ్ల మార్కెట్ నిర్మాణ విషయమై ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులను కలిశారు. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం కొహెడ గ్రామ పరిధిలో గతంలో ఏర్పాటు చేయాలనుకున్న పండ్ల మార్కెట్‌ను సహాయ సంచాలకులు ఉదయ్‌కుమార్ పరిశీలించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కాగా, ఇప్పటి వరకూ పనులను పట్టించుకోకపోవడంపై స్థానిక వ్యాపారులు అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌ను బాటసింగారం పండ్ల మార్కెట్‌కు తరలించిన నేపథ్యంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సొంతంగా స్థలం లేకుండా పోయింది. గతంలో పండ్ల మార్కెట్ స్థలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 1000 పడకల దవాఖానను నిర్మించాలని తలపెట్టింది. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా... కొహెడలో అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు స్థల సేకరణ కూడా చేపట్టింది. ఈ నేపథ్యంలో ఫేస్-1 పనుల్లో భాగంగా అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పలుమార్లు ఈ ప్రాంతాన్ని పరిశీలించి మార్కెట్ నిర్మాణ పనులకు మార్గాన్ని సుగమం చేశారు. ప్రభుత్వం మారడంతో నూతన మార్కెట్ నిర్మాణానికి జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఇప్పుడు ఆ పనులను పూర్తి చేస్తామని హడావుడి చేస్తుండడం గమనార్హం. త్వరలో సీఎం కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తారని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కాగా, ఇప్పటి వరకూ ఈ పనులను పట్టించుకోకపోవడంపై స్థానిక వ్యాపారులు అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

### ఎన్ని నిర్బంధాలు పెట్టినా..
## ఉద్యమాన్ని ఆపేది లేదు..

**వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య**



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొని మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

రంగారెడ్డి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ఎన్ని నిర్బంధాలు పెట్టినా ఉద్యమన్ని ఆపేది లేదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. ఆసరా పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న రిలే దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..ఏడాది గడుస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డిసెంబర్ నుంచి పింఛన్లు పెంచుతామని సోషల్ మీడియాలో ప్రకటన చక్కర్లు కొడుతున్నదని, ఎవరూ నమ్మవద్దన్నారు. ఉద్యమాన్ని నీరు గార్చడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా 2023 డిసెంబర్‌లో ప్రమాణ స్వీకారం చేశాడో.. అప్పటి నుంచి పెంచిన పింఛన్లను ఇస్తే తప్పా ఉద్యమాన్ని విరమించే ప్రసక్తి లేదన్నారు. నవంబర్ 26న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు ఆసరా పింఛన్‌దారులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సిలివేరు యాదమ్మ, జిల్లా నాయకులు జంగమయ్య, బాలరాజు, సలీం, సంజీవ, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

‘బలవంతంగా భూములను సేకరించడం తగదు.. భూమి విలువ రైతుకే తెలుస్తది.. సీఎం రేవంత్‌రెడ్డికి ఏం తెలుసు.. రియల్ ఎస్టేట్ వ్యాపారంగానే చూస్తున్నడు..’ అని దుద్యాల మండలంలోని లగచర్ల, హకీంపేట, పోలెపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంటతండాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తిలోని సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయొచ్చుగా అని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉండి కాదు.. దుద్యాలకు వచ్చి చూడాలని, సీఎంకు రాజకీయ ఎదుగుదలకు కారణమైన కొడంగల్‌పై ఇంత ద్వేషమెందుకని నిలదీస్తున్నారు. ఫార్మా కంపెనీ అని ముందుగా ప్రచారం చేసి ఇప్పుడు పరిశ్రమల హబ్ అంటూ మాట మార్చడం సరికాదని దుమ్మెత్తిపోస్తున్నారు. పది నెలలుగా అవస్థలు పడుతున్నామని, కలెక్టర్, అధికారులకు పలుమార్లు విన్నవించినా.. రాత్రి సమయంలో డ్రోన్లతో సర్వేలు చేయిస్తున్నారని బాధిత రైతులు మండిపడుతున్నారు.

- కొడంగల్, నవంబర్ 22



# బలవంతపు భూ సేకరణ ఎందుకు?

### తొండలు గుడ్లు పెట్టే భూములు ఎలా ఉంటాయో సీఎంకు తెల్వదు..

‘సీఎం రేవంత్‌రెడ్డికి భూముల విలువ తెల్వదు.. రైతు బిడ్డవైతే తెలుస్తది.. ఏ భూమిలో ఏ పంట పండుతదో తెలిసేది.. మొదటి నుంచి ‘రియల్’ వ్యాపారంపై అవగాహన ఉన్న సీఎంకు తొండలు గుడ్లు పెట్టని భూములు ఎలా తెలుస్తాయి..’ అని ఫార్మా బాధిత రైతులు పేర్కొంటున్నారు. గతంలో రెండు పర్యాయాలు కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికై.. ఇక్కడి ప్రజలనే పీడిస్తావా.. గ్రామాలకు వస్తే వాస్తవాలు తెలుస్తాయని సూచిస్తున్నారు. కొడంగల్ స్థితిగతులపై పట్టులేని సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకుల మాటలే వేదంలా అనిపిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఇక్కడికి వచ్చి వాస్తవాలను గ్రహిస్తే నిజాలు ఏమిటోఅర్థమవుతాయని, కక్షగట్టి భూములను లాక్కోవద్దని వాపోయారు.

### వేములవాడ రాజన్న సాక్షిగా అబద్ధాలు..

వేములవాడలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి కోసం భూ సేకరణ అని, తొండలు కూడా గుడ్లు పెట్టని భూములను మాత్రమే తీసుకుంటున్నామని వేములవాడ దైవం రాజన్న సాక్షిగా మాట్లాడడం సీఎం రేవంత్‌కే చెల్లిందని బాధిత రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పచ్చటి పొలాలు ఉన్న ప్రాంతాన్ని ఈ విధంగా వక్రీకరించి మాట్లాడడం రైతులను హేళన చేసినట్లుగా ఉన్నదని బాధను వ్యక్తం చేశారు. ఏండ్ల కాలంగా వరి, కంది, పత్తి, వేరుశనగ వంటి ఎన్నో పంటలను సాగు చేసుకుని జీవిస్తున్నామన్నారు.

### హైదరాబాద్‌లో ఉండి కాదు.. కొడంగల్‌కు వచ్చి చూడు..

హైదరాబాద్‌లో ఉండి కాదు.. కొడంగల్‌కు వచ్చి ఈ ప్రాంతాన్ని చూస్తే వాస్తవమేమిటో సీఎం రేవంత్‌రెడ్డికి అర్థమవుతుందని.. రైతులు పేర్కొంటున్నారు. పచ్చటి పంట పొలాలతో ఆనందంగా ఉన్న ప్రాంతంపై విషం చిమ్ముతున్నారని ఆరోపిస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు. నిజానికి తొండలు గుడ్లు పెట్టే పరిస్థితే ఉంటే బాధపడేవారం కాదని, కష్టపడి భూములను చదును చేసుకొని మాగాణిని చేసుకుని బంగారు పంటలు పండిస్తున్నామని రైతులు తెలిపారు.

### సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో ఫార్మా ఏర్పాటు చేయొచ్చుగా..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కల్వకుర్తిలోని కొండారెడ్డిపల్లిలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయొచ్చుగా అని దుద్యాల మండలంలోని రైతులు ప్రశ్నించారు. సీఎం ఊరు ఏమో పచ్చగ ఉండాలె.. కొడంగల్ ప్రాంతమేమో కాలుష్యంతో ఆగం కావాలా.. ఇదెక్కడి న్యాయమని పేర్కొన్నారు. రైతుల ఆవేదనను దాడిగా చిత్రీకరించి రాజకీయంగా కక్షసాధించడంపై సామాన్య రైతులం, ప్రజలం బలి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రైతుల మధ్య పూర్తి స్థాయిలో అవగాహన ఉంటే ఈ విధంగా జరిగేది కాదని, ఇంత జరిగినప్పటికీ సీఎం స్పందించడం లేదని తెలిపారు. స్థానికంగా ఉండే అధికారులు, కాంగ్రెస్ నాయకులను మధ్యవర్తులుగా చేసి భూమిని సేకరించడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గానికి వచ్చినప్పుడు రైతులను కలువాలని సీఎంకు ఎందుకనిపించడం లేదని వాపోతున్నారు.



### నోటికి వచ్చింది మాట్లాడితే ఎట్లా..

రైతులు, గిరిజనులు అంటే అంత చులకనా..? వ్యవసాయం చేస్తే భూమి ఎట్లుంటుందో తెలుస్తది. నోటికి వచ్చింది మాట్లాడితే ఎట్లా.. మా బతుకును ఆగం చేసినవ్.. మేం ఓటు వేయలేదా..? ఇక్కడికి వచ్చి కండ్లు తెరిచి చూస్తే పచ్చటి పంట పొలాలు కనిపిస్తయ్.. తొండలు గుడ్లు పెట్టే భూములు కావు. ఇక్కడి భూములకు ఎంతో డిమాండ్ ఉన్నది.. మీరు ఇస్తానంటున్నది ఎంత.. హైదరాబాద్‌లో ఉండి మాట్లాడితే కాదు.. మా తండాకు వచ్చి చూడు సారూ.. మా బతుకులు ఎట్ల ఉన్నయో అర్థమవుతుంది.

– చాందీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం



### భూములు ఇవ్వబోమని ముక్తకంఠంతో చెబుతున్నాం..

ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూములు ఇవ్వబోమని ముక్తకంఠంతో చెబుతున్నా.. సేకరణకు చర్యలు ఎందుకు తీసుకొంటున్నారని బాధిత రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పచ్చగా ఉండే ప్రాంతాన్ని ఫార్మా కంపెనీల ఏర్పాటుతో కాలుష్యాన్ని నింపాలని సీఎం చూస్తున్నారని మండిపడుతున్నారు. ఇక్కడి భూములే కావాలా.. వేరే ప్రాంత భూములు పనికిరావా.. అంటూ ఆగ్రహిస్తున్నారు.

### రూ.30లక్షలు ఇస్తే.. వేరే చోట భూమి దొరుకుతుందా..

మా భూములకు మార్కెట్‌లో రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు ధర ఉంటే రూ.30లక్షలు చెల్లిస్తామనడం ఏమిటీ..? ఆ డబ్బులతో వేరేచోట ఇదే డిమాండ్ ఉన్న భూమి వస్తదా..! కొనే పరిస్థితి ఉన్నదా.. అంటూ బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. పుట్టిన నాటి నుంచి వ్యవసాయంపైనే జీవిస్తున్నామని పేర్కొంటున్నారు. విలువైన భూములను వదులుకొని, ఎక్కడ జీవించాలి.. ఎవరి పంచన బతకాలని ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో ఇందిరమ్మ పేదలకు బతుకమని భూమి ఇస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భూములను లాక్కోవడం ఏమిటని వాపోతున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రజల అభీష్టాన్ని గుర్తించి మసలుకోవాలని వేడుకుంటున్నారు.

### భూముల విలువ సీఎం రేవంత్‌కు ఏం తెలుసు..

- పచ్చటి పంట పొలాలు.. తొండలు గుడ్లు పెట్టని భూముల్లా కనిపిస్తున్నాయా ?
- వేములవాడ రాజన్న సాక్షిగా అబద్ధాలు మాట్లాడడం సీఎంకే చెల్లింది..
- హైదరాబాద్‌లో ఉండి కాదు.. దుద్యాలకు వచ్చి చూడాలి
- సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో కంపెనీలను ఏర్పాటు చేయొచ్చుగా..
- కొడంగల్‌పై ఇంత ద్వేషమెందుకు..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు



### ఏం జరిగినా భూమి ఇచ్చేది లేదు..

సీఎం రూ.30లక్షల వరకు ఇస్తామంటున్నడు. అదే రైతులతో నేరుగా మాట్లాడితే మాకు ఏం కావాలో చెబుతాం.. ఎవరో వచ్చి ఇంత ఇస్తాం.. అంత ఇస్తాం.. మీకు ఇల్లు వస్తది.. ఉద్యోగం వస్తది.. అంటే మాకు నమ్మకం ఏమిటీ.. భూమి పోతే మేం బతకలేము. వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నం. ఉద్యోగం ఇస్తామంటే మాకు సదువులేదు. ఉద్యోగంతో కొంతకాలం బతుకుతాం. ఆ తరువాత ఎట్లా.. మీరిచ్చే పైసలకు ఎక్కడనన్న భూమి కొనగలమా.. మాకు ఫార్మా వద్దు.. మా భూములను లాక్కోవద్దు..

– ముత్యాలీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

## బియ్యం పిండితో యాంటిబయోటిక్స్

### రూ. 6.91 లక్షల విలువైన సరుకు స్వాధీనం..ఇద్దరు నిందితుల అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ):ప్రజల ప్రాణాలకు హానికలిగించే నకిలీ మందులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కొరడా ఝుళిపిస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా నకిలీ ఔషధాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన డీసీఏ అధికారులు.. శుక్రవారం నకిలీ యాంటిబయోటిక్, నార్కోటిక్ మందులను పట్టుకుని సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... యూపీకి చెందిన మహేశ్ కుమార్ షైనీ తన కంపెనీలో నిబంధనలకు విరుద్ధంగా సుద్ద, బియ్యం పిండితో నకిలీ యాంటిబయోటిక్ మందులను తయారు చేసి దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన గండ్ల రాములు, మునిశేఖర్ మహేశ్‌కుమార్ వద్ద నుంచి నకిలీ యాంటిబయోటిక్ మందులతో పాటు సర్జరీల్లో వినియోగించే ఫెంటనైల్ ట్రాన్స్‌డెర్మల్ ప్యాచెస్‌ను కొనుగోలు చేసి తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని కర్నూలుకు సరఫరా చేస్తున్నారు.

**కొరియర్ ద్వారా దిగుమతి..**

నకిలీ యాంటిబయోటిక్ మందులు, నార్కోటిక్ డ్రగ్స్‌ను నిందితులు యూపీ నుంచి నగరానికి కొరియర్ ద్వారా తెప్పించుకుని ఆ తరువాత వాటిని తెలంగాణలోని కరీంనగర్, ఏపీలోని కర్నూలు ప్రాంతాల్లోని మెడికల్ షాపులకు సరఫరా చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు శుక్రవారం బాలానగర్‌లోని తిరుపతి కొరియర్ సంస్థపై ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీసీఏ అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.6.91లక్షల విలువ చేసే నకిలీ యాంటిబయోటిక్ మందులతో పాటు నార్కోటిక్ డ్రగ్స్‌ను సీజ్, నిందితులు గండ్ర రాములు, మునిశేఖర్‌లను అరెస్టు చేశారు. అయితే గండ్ర రాములు గతంలో కూడా నకిలీ ఔషధాలను సరఫరా చేసిన అతడు పాత నేరస్తుడని, అతడిపై మూడు కేసులు నమోదై ఉన్నట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి నకిలీ యాంటిబయోటిక్ ఔషధాలు, నార్కోటిక్ డ్రగ్స్ పట్టుకున్న డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, సరూర్‌నగర్, ఉప్పల్, సికింద్రాబాద్, మలక్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, లక్ష్మణ్, గోవింద్‌సింగ్, అనిల్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు, ఇతర సిబ్బందిని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.



నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి, వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

**వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, నవంబర్ 22: అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, పాఠశాల తనిఖీలు తదితర అంశాలపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే పథకాలను అమలు పరచాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించే క్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, పరిష్కరించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. వసతి గృహాలు, పాఠశాలలో కచ్చితంగా సన్న బియ్యాన్ని సరఫరా చేసి నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారానికి 3 సమయాల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించారు. నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భవనాల్లో మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. వైద్య అధికారులు, సిబ్బంది పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీవో శ్రీనివాస్, డీఈవో రేణుకా దేవి, సీపీవో అశోక్, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్